

13న జాతీయ లోక్‌అదాలత్

శ్రీకాకుళం లీగల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'జాతీయ లోక్‌అదాలత్ ఈనెల 13న నిర్వహించనున్నాం. ఈ కార్యక్రమంలో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసుకునేందుకు అందరూ సహకరించాల'ని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్‌మౌలానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులను రాజీ చేయడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కావు. త్వరితగతిన కక్షిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, అధికారులు, పోలీసులు, ఇన్సూరెన్సు, బ్యాంకుల అధికారులు ఉపయోగించుకోవాల'ని జిల్లా న్యాయాధికారి సూచించారు.

టెక్కలి మండలంలో కలపాలి



సారవకోట మండలంలో మేము ఉన్నాం. మా పక్క ఇంటివారు టెక్కలి మండలం పరిధిలో ఉన్నారు. మండల కార్యాలయంలో పనుల కోసం సారవకోట వెళ్లాలంటే 40 కిలోమీటర్ల దూరం కావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. నిధులు కూడా మంజూరు చేయక.. అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. మా గ్రామాన్ని టెక్కలి మండలంలో కలిపితే మంచిది.

- ఎస్.తాతారావు, బంజీరుపేట

ఇబ్బందులు పడుతున్నాం



మేము టెక్కలి మండలానికి 7 కిలోమీటర్లు, సారవకోట మండలానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నాం. కనీస అభివృద్ధి లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల టెక్కలి మండలంలో మా గ్రామాన్ని కలపాలని అధికారులకు వినతి పత్రం అందజేశాం.

- సావుకారి ధర్మారావు, బంజీరుపేట కోలనీ

అభివృద్ధి లేదు



మా గ్రామంలో రెవెన్యూ సమస్యలు చాలా ఉన్నాయి. సారవకోట మండలానికి దూరంగా ఉండడం వల్ల మా గ్రామంవైపు అధికారులు వచ్చే పరిస్థితి లేదు. అభివృద్ధి పనులు జరగడం లేదు.

- ఆర్.ఈశ్వరావు, బంజీరుపేట



ఇదే బంజీరుపేట గ్రామం

- టెక్కలికి ఏడు.. సారవకోటకు 40 కిలోమీటర్ల దూరంలో బంజీరుపేట
- కనీసస్థాయిలో అభివృద్ధి శూన్యం
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- సవర బంజీరుపేట, మర్రిపాడు గ్రామాలదీ అదే దుస్థితి

ఒకే వీధి.. రెండు మండలాలు!

టెక్కలి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా ఒక గ్రామానికి.. ఒకే మండలం ఉంటుంది. కానీ ఆ గ్రామంలో మాత్రం ఒకే వీధి.. రెండు మండలాల పరిధిలో ఉండడం గమనార్హం. ఇదీ బంజీరుపేట గ్రామంలో ఓ కాలనీ ప్రత్యేకత. రెండు మండలాల పరిధిలో ఉన్నా.. అభివృద్ధి విషయంలో మాత్రం తమను పట్టించుకున్న నాథులు కరువయ్యారన్నది గ్రామస్థుల ఆవేదన.

బంజీరుపేట కాలనీ గ్రామం.. టెక్కలి మండలానికి 7 కిలోమీటర్ల సమీపంలో.. సారవకోట మండలానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలో సుమారు 60 ఇళ్లు ఉండగా.. కాలనీలో 23ఇళ్లు ఉన్నాయి. గ్రామంలో సగం ఇళ్లు సారవకోట మండలం కూర్మనాథపురం పంచాయతీలో ఉన్నాయి. కాలనీ వీధిలో 8 ఇళ్లు మాత్రం టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీలో ఉన్నాయి. కొన్నాళ్ల కిందట టెక్కలి మండలం సొర్లిగాం గ్రామానికి చెందిన కొంతమంది సారవకోట మండలంలో బంజీరుపేట కాలనీకి ఆనుకుని ఇళ్లు నిర్మించారు. దీంతో (మిగతా 6వ పేజీలో..)

ఒక్కో మ్యుటేషన్‌కు రూ.20వేలు ఇవ్వాలంట!

- సరిచేయడానికి డబ్బులు అడుగుతున్నారు
- రెవెన్యూ అధికారుల తీరుపై ఆరోపణలు
- ఆర్డీవో ఎదుట టీడీపీ నాయకుడి ఆవేదన

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మ్యుటేషన్ చేయడానికి అధికారులు రూ.20వేలు అడుగుతున్నారంటూ ఓ టీడీపీ నాయకులు చేసిన ఆరోపణ కలకలం రేపింది. అక్కడే ఉన్న కొందరు రైతులు ఇది నిజమేనని చెప్పడంతో అక్కడే ఉన్న అధికారులు కంగుతిన్నారు. మంగళవారం గుణుపల్లి సచివాలయంలో ఆర్డీవో జి.వెంకటేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీతారామ్మూర్తి స్థానిక రైతులతో సమావేశమయ్యారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, నష్ట పరిహారం విషయమై చర్చించారు. దీనిపై రైతుల అభిప్రాయాలను స్వీకరించారు. అక్కడే ఉన్న గుణుపల్లి పంచాయతీ టీడీపీ నాయకుడు జోగి తిరుపతిరావు మాట్లాడుతూ 'వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు రెవెన్యూ పరిధిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వేలో అనేక తప్పులు దొర్లాయి. వాటిని ప్రస్తుతం సరిచేయాలని కోరగా రెవెన్యూ అధికారులు (మిగతా 6వ పేజీలో..)

- ఈ ఆరోపణలపై ఆర్డీవో వెంకటేష్ వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. విచారణ చేసి.. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకరిద్దరు తీరువల్ల రెవెన్యూ వ్యవస్థపై అవినీతి మచ్చ పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవ చేయాలి తప్ప వారి నుంచి డబ్బులు ఆశించవద్దని స్పష్టం చేశారు.



సమావేశానికి హాజరైన రైతులు.. ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకుడు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎమ్మెల్యే శంకర్

రిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో రోగులకు మరింత మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ 29వ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'రిమ్స్‌లో వైద్యసేవలు మెరుగుపడాలి. అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి వైద్యులను రప్పించి సేవలు అందించాల'ని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'వైద్యం కోసం వచ్చిన ఏ ఒక్కరినీ విశాఖపట్నం రిఫర్ చేయొద్దు. స్థానికంగానే సరైన వైద్యం అందించి.. ఇతర సదుపాయాలు కల్పించాలి. ఆసుపత్రిలో నిర్మాణం పూర్తయిన భవనాలు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి. రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌కు అవసరమైన ఉపకరణాలు సమకూర్చుకోవాలి. నెఫ్రాలజీ యూనిట్ ఐసీయూలో 4 పర్మినెంట్ బెడ్లు ఉండేలా ఏర్పాట్లు చేయాలి. అన్ని వేళలా వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందజేయాల'ని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అనిత, రిమ్స్ వైద్యులు, సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'అభ్యుదయం'లో భాగస్వామ్యం కావాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా నిర్వహిస్తున్న అభ్యుదయం సైకిల్‌యాత్రలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. 'అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో గత నెల 12న హోంశాఖ మంత్రి అభ్యుదయం సైకిల్‌యాత్ర ప్రారంభించారు. అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం జిల్లాలో విజయవంతంగా ఈ యాత్ర సాగి.. ఈ నెల 16న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం పట్టణంలోకి ప్రవేశించనుంది. ఈ యాత్రలో పట్టణ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. సింహద్వారం నుంచి డే అండ్‌నైట్ , రామలక్ష్మణ జంక్షన్, సూర్యమహల్, అరసవల్లి మిల్లు జంక్షన్, పీఎస్ఆర్ జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్ మీదుగా యాత్ర సాగుతుంది. అనంతరం ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై భారీ అవగాహన సదస్సు నిర్వహిస్తాం. ఈ యాత్ర జిల్లాలో పలు ప్రాంతాల్లో కొనసాగి ఇచ్ఛాపురంలో ముగియనుంద'ని ఎస్పీ తెలిపారు.

గడ్డికి గడ్డుకాలం

- యంత్రాలతో వరినూర్పుళ్లు
- వేధిస్తున్న పశుగ్రాసం కొరత
- ఆందోళనలో పాడిరైతులు
- దాణా పంపిణీ చేయాలని విజ్ఞప్తి

నరసన్నపేట/ ఎల్.ఎన్.పేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు గ్రాసం(గడ్డి) కొరత వెంటాడుతోంది. వ్యవసాయం యాంత్రీకరణ నేపథ్యంలో గ్రామాల్లో పశువుల సంఖ్య తగ్గింది. కానీ పాలకు డిమాండ్ ఉండడంతో కొంతమంది రైతులు వ్యవసాయంతోపాటు పాడి పశువుల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 3,75,345 ఆవులు/ గేదెలు, 45,914 దూడలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒక్కో ఆవు లేదా గేదెకు ఏడాదికి టన్నున్నర ఎండు గడ్డితోపాటు పచ్చిగడ్డి, దాణా కూడా అవసరం. కానీ, జిల్లాలో సరిపడా పశుగ్రాసం లేదు. దీనికి కారణం వ్యవసాయ యాంత్రీకరణమే. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.80 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. దాదాపు 70 శాతం మేరకు యంత్రాలతో వరి కోతలు, నూర్పులు చేపట్టారు. దీంతో పశుగ్రాసం ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది లక్ష టన్నులు మాత్రమే పశుగ్రాసం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. పశుగ్రాసం ఉత్పత్తి తగ్గిపోవడంతో పాడిరైతులు లబోదిబోమంటున్నారు. కొంతమంది రైతులు తాము పండించిన వరి పంటను కూలీలతో కోతలు కోయించి.. వరిగడ్డిని (మిగతా 6వ పేజీలో..)



ట్రాక్టర్‌తో తరలిస్తున్న వరిగడ్డి

సమాచారం



జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రసన్నకుమార్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు రిమ్స్ ప్రిన్సిపాల్ డా. అప్పలనాయుడు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా అదనపు విధులను నిర్వహించారు. ప్రస్తుతం ఎముకల విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ ప్రసన్నకుమార్ పూర్తి అదనపు బాధ్యతలతో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తారు. ప్రసన్నకుమార్‌ను రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పలనాయుడు, జేడీ రాజశేఖర్ అభినందించారు.

పంటలపై 'పగ' మంచు!
- ఆందోళన చెందుతున్న రైతులు

6లో

వాహన'దారులు' చూసుకోండి!
- పొగ మంచుతో ప్రమాదాలకు ఆస్కారం
- నెమ్మదిగా నడిపితేమేలు

హెచ్చరిక బోర్డు పెట్టినా వినట్లే!
- రోడ్డుపక్కనే పడేస్తున్న చెత్తా చెదారం

8లో

రెగ్యులర్ డీఈవోగా రవిబాబు

శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ డీఈవోగా ఏ.రవిబాబు నియమితులయ్యారు. రెండు నెలల నుంచి జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఇన్‌చార్జి డీఈవోగా రవిబాబు కొనసాగుతున్నారు. ఈయనను రెగ్యులర్ డీఈవోగా నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులను జారీచేశారు.

డ్వామా ఇన్‌చార్జి పీడీగా లవరాజు

శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు లవరాజుకు అప్పగించారు. ఇదివరకు పీడీగా కొనసాగిన సుధాకరరావు విజయవాడ సెర్ప్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మంగళవారం విజయవాడలో బాధ్యతలను కూడా స్వీకరించారు. దీంతో ప్రస్తుత ఇన్‌చార్జి పీడీగా.. ఉపాధి హామీ పథకంలోనే జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు అదనపు బాధ్యతలతో వ్యవహరించనున్నారు.



ఆకట్టుకున్న 'హరిత మహోత్సవం'

6లో



పాలసింగిలో కిడ్నీవ్యాధులపై ఆరా తీస్తున్న వైద్యులు

నొప్పి నివారణ మందులే కారణం

- ఆర్ఎంపీలు అధిక మోతాదులో ఇస్తున్నారు
- కిడ్నీ వ్యాధులపై తేల్చిన వైద్యులు
- కదిలిన వైద్య, ఆరోగ్యశాఖ
- పాలసింగిలో వైద్య పరీక్షలు
- సీఎం పేషీ నుంచి ఆరా

6లో

ఆంధ్రజ్యోతి ఎక్స్‌క్లూజివ్


పంటలపై పగమంచు!

● ఆందోళన చెందుతున్న రైతులు


సీతన్నపేట వద్ద దట్టంగా కురుస్తున్న పొగమంచు


శ్రీజగన్నాథపురంలో సాగులో ఉన్న ఉల్లి

కోటబొమ్మాళి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న పొగమంచు వల్ల ఉల్లి, పెసర, మినప, మిరప, బెండ తదితర వాణిజ్య పంటలను సాగుచేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలపై పగబట్టినట్టుగా రాత్రి, పగలు తేడా లేకుండా కురుస్తున్న పొగమంచు వల్ల ఇవి దెబ్బ తింటుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని జర్జంగి, శ్రీజగన్నాథపురం, చీపుర్లపాడు, నారాయణవలస, సౌడాం, రేగులపాడు, యలమంచిలి, చిన్నసాన, కన్నెవలస, పెద్దబమ్మిడి, హరిశ్చంద్రపురం, దుప్పిలపాడు, నీలంపేట, కొత్తపల్లి, జీయన్నపేట, తర్లిపేట, నారాయణవలస తదితర పంచాయతీల్లో ఎక్కువగా మెట్ట ప్రాంతం ఉండడం... ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో రైతులు ఉల్లి, మిరప, వంగ, టమాట, బీన్సు, బీర, ఆనప, కాకర తదితర పంటలు విస్తరంగా సాగు చేస్తున్నారు. ఈ పొగమంచుకు తోడు పేను వ్యాధి వ్యాప్తి చెందడంతో ముడత తెగుళ్లు వచ్చి సమూలంగా నాశనమవుతోందని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ పరిస్థితిలో పంట కాపాడుకోవడానికి సంబంధిత అధికారులు సూచనలివ్వాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


జర్జంగిలో మంచు..

వణికిస్తున్న చలిపులి

గత వారం రోజులుగా చలిపులి ప్రజలను వణికిస్తోంది. ఉదయం 7 గంటల వరకు ఎవరూ బయటకు రాలేకపోతున్నారు. ఒక వైపు చలి, మరోవైపు పొగమంచు అలుముకోవడంతో ప్రజలు జలుబు, న్యూమోనియా వంటి వ్యాధులకు గురవుతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచే చలి విపరీతంగా పెరగడంతో రాత్రి వేళ బయటకు రాలేని పరిస్థితి ఉంటోంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

ప్రస్తుతం కురుస్తున్న పొగమంచు వల్ల వాణిజ్య పంటలకు తెగుళ్లు రాకుండా నివారణ చర్యలపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటలకు సోకిన తెగుళ్లను బట్టి ఏ మందులు వాడాలో రైతులకు వివరిస్తున్నాం.

- కె.సునీత, ఉద్యానవనశాఖ అధికారి, కోటబొమ్మాళి

వాహనదారులు చూసుకోండి

● పొగ మంచుతో ప్రమాదాలకు ఆస్కారం

● నెమ్మదిగా నడిపితేనే మేలు


ఇటీవల ఎత్తురాళ్లపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

కోటబొమ్మాళి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓవైపు చలి... మరోవైపు దట్టంగా కమ్ముకుంటున్న పొగమంచు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. జాతీయ రహదారిపై మరింత అప్రమత్తంగా ఉండాలి. సూర్యోదయం తరువాత కూడా కొద్ది గంటల పాటు దారి స్పష్టంగా కనిపించకుండా మంచు తెరలు అడ్డు పడుతున్నాయి. జిల్లా పరిధిలోని ఇచ్ఛాపురం నుంచి పైడిభీమవరం వరకు హైవే పై రోజూ వేలాది వాహనాలు వెళ్తుంటాయి. రాత్రి వేళ ప్రయాణాలు అధికం. వీటికి తోడు ఇటు విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు, అటు బరంపురం, భువనేశ్వర్‌కు ప్రైవేటు బస్సుల జోరు అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో అటు భారీ వాహనాలతో పాటు ఇటు ద్విచక్ర వాహనాలు నడిపే వారు సైతం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. నవంబర్-ఫిబ్రవరి మధ్య జరిగే అత్యధిక ప్రమాదాలకు కారణం వేగంతో పాటు మంచు. కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్ పరిధిలో గతేడాది మంచు కారణంగా గట్లపాడు నుంచి జీయన్నపేట మధ్య కొందరు మృత్యువాత పడగా మరికొంతమంది గాయపడ్డారు. హైవే పక్కన నిలిచిన వాహనాలను గుర్తించలేక మిగిలిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పోలీసుల ప్రత్యేక దృష్టి

ఇటీవల ఎత్తురాళ్లపాడు వద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జాతీయ రహదారిపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసులకు గట్టిగా చెప్పారు. అప్పటి నుంచి హైవేపై ఒక ఎస్‌ఐతో కూడిన ప్రత్యేక బృందం ప్రమాదాల నివారణకు హైవేపై పహారా కాస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన ప్రదేశాలైన ఎత్తురాళ్లపాడు, మంచాలపేట, పాకివలస, కన్నెవలస పెట్రోల్ బంకు, తర్లిపేట జంక్షన్, జీయన్నపేట జంక్షన్, జర్జంగి జంక్షన్, పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, గట్లపాడు, సుబ్బారావుపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు ఉన్న చోట పోలీసులు పహరా కాస్తున్నారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

ఆపుతాం... జాగ్రత్తలు చెబుతాం

చలికాలంలో ప్రమాదాల తీరును దృష్టిలో ఉంచుకుని ప్రతి కూడలిలో నిఘా ఉంచుతున్నాం. వాహన చోదకులను అప్రమత్తం చేయడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నాం. ఒక చోదకుడు ఉన్న వాహనాలు, కుటుంబాలతో వెళ్లే వారిని రాత్రి 12 నుంచి ఉదయం 5 గంటల వరకు విరామం తీసుకునేలా చైతన్య పరుస్తున్నాం. ఇప్పటికే పెట్రోలింగ్ సిబ్బందితో పాటు పోలీసులు పహారా కొనసాగిస్తున్నారు.

- కె.శ్రీనివాసరావు, సీఐ, కోటబొమ్మాళి

సెంటు భూమి కూడా ఇవ్వలేం

● భూములు కోల్పోయాక డబ్బులతో ఏం చేయాలి?

● అధికారులు పునరాలోచించండి

● గుణుపల్లి గ్రామస్థుల వినతి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'భూములు కోల్పోయిన తరువాత వచ్చిన డబ్బులతో ఏం చేయాలో మాకు తెలియదు. భూములపై వ్యవసాయం చేయడమే మాకు తెలిసింది. మా పూర్వీకుల నుంచి వ్యవసాయం చేస్తూ హాయిగా బతుకుతున్నాం. మేం సెంటు భూమి కూడా ఇవ్వలేం. మా ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అధికారులు పునరాలోచించాల'ని గుణుపల్లి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రం అందించారు. మంగళవారం గుణుపల్లి సచివాలయంలో ఆర్డీవో జి.వెంకటేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీతారామ్మూర్తి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందించే పరిహారం వివరాలను అధికారులు తెలియజేశారు. భూముల ధరకు రెండున్నర రెట్లు అధికంగా పరిహారం అందిస్తామని తెలిపారు. తోటలలో ఉన్న మొక్కలు, బావులు, ఆవుల శాలలకు రెట్టింపు పరిహారం అందిస్తామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు కొంత విలువైన భూములు అందిస్తామని చెప్పారు.


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఎంతో శ్రమించాం

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తితలీ తుఫాన్ దాటికి చెట్లు నెలమట్టమయ్యాయని చెప్పారు. ఎంతో శ్రమించి మళ్లీ తోటల్లో చెట్లు పెంచుకొని వ్యవసాయం చేస్తున్నామని అధికారులకు వివరించారు. పూర్వీకుల కాలం నుంచి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. అధికారులు ఇచ్చే డబ్బులతో ఏం చేయాలో తమకు తెలియదన్నారు. అభివృద్ధికి తాము ఆటంకం కాదన్నారు. ప్రభుత్వ భూములు ఉండగా తమ భూములు ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో ఎంతో ఆవేదనకు గురవుతున్నామని తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్వాసిత ప్రాంతంలో చిన్న చిన్న రైతులే ఉన్నారని... వారికి అన్యాయం చేయవద్దని కోరారు. భూములను తమ నుంచి దూరం చేయవద్దన్నారు. భూములు వదులుకోవడానికి సిద్ధంగా లేమని తెలుపుతూ వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. దీంతో రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పి... అధికారులు సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ మనోహర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నొప్పి నివారణ మందులే కారణం

● ఆర్‌ఎంపీలు అధిక మోతాదులో ఇస్తున్నారు

● కిడ్నీ వ్యాధులపై తేల్చిన వైద్యులు

● కదిలిన వైద్య, ఆరోగ్య శాఖ

● పాలసింగిలో వైద్య పరీక్షలు

● సీఎం పేషీ నుంచి ఆరా


బావిని పరిశీలిస్తున్న వైద్యులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

టెక్కలి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీలు అధిక మోతాదులో ఇచ్చే నొప్పి నివారణ మందులు (పెయిన్ కిల్లర్స్) వినియోగించడం వల్లనే కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నట్టు వైద్యాధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై వివరాలు సేకరించారు. పాలసింగి గ్రామంలో కిడ్నీ వ్యాధి తీవ్రతపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పాలసింగిలో కిడ్నీ వ్యాధి' శీర్షికన కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కదిలారు. ఆ గ్రామానికి వెళ్లి.. పరిస్థితిపై ఆరా తీశారు. గత కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నట్లు గుర్తించారు. కొంతమంది గిరిజనులు ఆర్‌ఎంపీల వద్ద వైద్యం పొందుతూ... నొప్పి నివారణ మందులు అధికంగా వాడడం వల్ల కిడ్నీ వ్యాధులు పెరిగాయని గుర్తించారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసినట్టు తెలిసింది. డీఎంహెచ్‌వో అనిత నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరాలు సేకరించారు. ఈ మేరకు విశాఖ, శ్రీకాకుళం నుంచి వైద్య బృందాలను పాలసింగికి పంపించారు. గ్రామంలో తాగు నీటిని పరీక్షించారు. ఇప్పటి వరకు ఎంతమంది కిడ్నీ వ్యాధితో మృతి చెందారు? ఎంతమంది డయాలసిస్ చేయించుకుంటున్నారు? అనే వివరాలు సేకరించారు. కొంతమంది దీని కోసం మందులు వాడుతున్నట్లు గుర్తించారు. గ్రామంలోని కొంతమంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. కిడ్నీ వ్యాధులపై గ్రామంలోని గిరిజనులకు అవగాహన కల్పించారు. వ్యాధి తీవ్రత పెరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాగునీటిని నిత్యం క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కిడ్నీ వ్యాధి నిపుణులు శరత్‌జ్యోత్స్న, ప్రోగ్రాం అధికారి డా.శివరంజని, వైద్యులు సుజాత, రాపిడ్ బృందం వైద్యులు సుమలత, అంజనీదేవి, ఎం.హరిష్, కార్యదర్శులు చంద్రశేఖర్, ధర్మారావు, మీనా, టీడీపీ నాయకులు జి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఒకే వీధి.. రెండు మండలాలు!

(ఐదో పేజీ తరువాయి)

రెండు వీధులు ప్రస్తుతం కలిసి ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఒకే గ్రామం.. రెండు మండలాలుగా మారిపోయింది. లింగాలవలస పంచాయతీకి దగ్గరలో ఉన్న బంజీర్‌పేటతో పాటు, సవర బంజీరుపేట, మర్రిపాడు గ్రామాలు సారవకోట మండలంలో ఉన్నాయి. దీంతో ఈ గ్రామస్థులంతా 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. సచివాలయం కూడా 8 కిలోమీటర్ల దూరంలోని కూర్మనాథపురంలో ఉండడంతో ఏదైనా అవసరంపై కార్యాలయానికి వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. రెండిటికీ చెడ్డ రేవడిలా తమ పరిస్థితి మారిందని బంజీరుపేట కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. తాగునీరు, సాగునీరు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. రెండు మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిధుల మంజూరు విషయంలో శ్రద్ధ చూపడం లేదని చెబుతున్నారు. ఫలితంగా తమ కాలనీ అభివృద్ధి దూరమవుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు. కాస్త దగ్గరలో ఉన్న టెక్కలి మండలంలో తమ గ్రామాలు విలీనం చేయాలని బంజీర్‌పేటతోపాటు, సవర బంజీరుపేట, మర్రిపాడు గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఒక్కో మ్యుటేషన్‌కు రూ.20వేలు ఇవ్వాలంట!

(ఐదో పేజీ తరువాయి)

డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఒక్కో మ్యూటేషన్‌కు రూ.20వేల వరకు డిమాండ్ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. భూముల సర్వే నెంబర్లు తప్పులు సవరించడానికి ఇన్ని ఇబ్బందులు పెడుతున్న అధికారులు.. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రైతులను భూములు ఎలా అడుగుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఆరోపణలు నిజమేనంటూ మరికొంతమంది రైతులు మద్దతు తెలపడం సభ ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారింది.

ఆకట్టుకున్న 'హరిత మహోత్సవం'

పాత శ్రీకాకుళం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హరిత మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. ఐఎంఏ, పీడియాట్రిక్స్ ఎన్జీవోస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 50 పైగా ప్రకృతి సిద్ధ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రకృతి సౌందర్యాన్ని.. సంప్రదాయాన్ని, సేంద్రియ ఉత్పత్తులను ఒకే వేదిక పైకి తీసుకు రావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. మొక్కలతో ఏర్పాటు చేసిన హృదయాకారం (లవ్‌సింబల్) ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సంప్రదాయ హస్తకళల ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాలు, పర్యావరణ పంటలపై పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కొండపల్లి బొమ్మలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా సహజ జీవన విధానం, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.




గీతాలాపన..



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సందర్శకులు


ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

● డీవీఈవో సురేష్‌కుమార్


రికార్డులను పరిశీలిస్తున్న డీవీఈవో సురేష్‌కుమార్

ఎల్‌ఎన్ పేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి సురేష్‌కుమార్ అన్నారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అధ్యాపకులు, విద్యార్థుల హాజరు పట్టికలు, కళాశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని అధ్యాపకులకు సూచించారు. అధ్యాపకులు సమయ పాలన పాటిస్తూ అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

గడ్డికి గడ్డుకాలం

(ఐదో పేజీ తరువాయి)

భద్రం చేసుకుంటున్నారు. కానీ, అధిక శాతం మంది యాంత్రీకరణపై మొగ్గు చూపడంతో పశుగ్రాసం కోసం పాట్లు తప్పడం లేదు. కొరత కారణంగా పశుగ్రాసానికి డిమాండ్ పెరిగిందని పాడి రైతులు వాపోతున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడు గడ్డి రూ.7వేలకు కొనుగోలు చేస్తున్నామని పేర్కొంటున్నారు. దీనికితోడు మార్కెట్‌లో తవుడు, నూకలు ఇతర పోషకాలతో కూడా దాణా ధరలు కూడా గతంలో కంటే భారీగా పెరిగాయని ఆవేదన చెందుతున్నారు. పాడి పశువుల పెంపకం భారమవుతోందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కనీసం దాణా అయినా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

దాణా పంపిణీ చేయాలి

మార్కెట్‌లో పోషకాలతో తయారు చేసిన పశు దాణా ధరలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం స్పందించి పాడిరైతులకు రైతు సేవాకేంద్రాల ద్వారా పశు దాణాను సబ్సిడీపై పంపిణీ చేయాలి. అర్హులైన పాడి రైతులకు అందేలా చర్యలు చేపట్టాలి.

- శిమ్మ, పాడిరైతు, నరసన్నపేట

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

గతేడాది పశుదాణా సబ్సిడీపై పంపిణీ చేశాం. ఈ ఏడాది జిల్లాలో పాడిపోషణపై రైతులు దృష్టి సారించారు. గ్రామాల్లో సిబ్బంది ద్వారా పాడి రైతులను గుర్తించి తగిన నివేదికను ప్రభుత్వంకు నివేదిస్తాం.

- రాజగోపాలరావు, జేడీ, పశుసంవర్థక శాఖ, శ్రీకాకుళం

లక్ష్యాలను వేగవంతం చేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల పనితీరు ఆధారంగా లక్ష్యాలను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాఖల వారీగా పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయ, మైనారిటీ వెల్ఫేర్, అటవీ, గృహనిర్మాణ, ఐసీడీఎస్, ఎస్సీ కార్పొరేషన్ల ప్రగతిపై ప్రత్యేకంగా సమీక్షించారు. కీలక శాఖల పనితీరును పరిశీలిస్తామని, తావులేదని హెచ్చరించారు. వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ పథకాలు, రైతుల సేవలు అమలుపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించామని తెలిపారు. ప్రయాణికుల రక్షణ విషయంలో ఆర్టీసీ సిబ్బంది ప్రవర్తన రాష్ట్రంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలవడంపై అధికారులను కలెక్టర్ అభినందించారు. బస్టాండ్‌ల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం నిర్వహణ మెరుగుపడాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ పరిధిలో పెద్ద ఎత్తున చెత్త పేరుకు పోవడాన్ని స్వయంగా చూశానని, పారిశుధ్య పరిస్థితి మారకపోతే షాప్‌లను సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లా, మండలస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృధ్వీరాజ్ కుమార్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉప్పరిపేట రోడ్డుకు మోక్షం

● రూ.50 లక్షల 'ఉపాధి' నిధులు మంజూరు

గార, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూలుగు పంచాయతీ ఉప్పరపేట గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల ఉపాధి నిధులు మంజూరయ్యాయి. దీంతో త్వరలో రోడ్డు నిర్మాణం జరగనున్న నేపథ్యంలో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉప్పరపేటకు వైసీపీ ప్రభుత్వ హయాంలో 2003లో సుమారు కిలోమీటరు రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు కాగా అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. రోడ్డు ఎర్త్ పనులు కొంతమేర చేపట్టారు. అయితే ఆ తరువాత బిల్లుల్లో జాప్యంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో అప్పటి నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సమస్యను స్థానికులు ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి అనేక పర్యాయాలు తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందించి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రూ.50 లక్షలతో అంచనాలు తయారు చేయగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై మండల ఇంజనీరింగ్ అధికారి పి.గోవిందరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఉప్పరపేట రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.


ఉప్పరపేటకు వెళ్లే రోడ్డు దుస్థితి

శిథిలావస్థలో పాఠశాల భవనం

● అద్దె ఇంటిలో తరగతుల నిర్వహణ
● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



పాఠశాల నిర్వహిస్తున్న అద్దె భవనం


శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల భవనం

ఆమదాలవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డు పాతినవానిపేట మునిసిపల్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. సుమారు 30 ఏళ్ల కిందట అప్పటి మునిసిపల్ చైర్‌పర్సన్ బొడ్డేపల్లి సత్యవతి హయాంలో ఈ భవనం నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలిపోతుందో తెలియడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ పాఠశాలలో 35 మంది విద్యార్థులుండగా భవనం పరిస్థితిని చూసి సుమారు 10 మందిని ప్రైవేటు పాఠశాలల్లో చేర్చారు. విద్యార్థుల సంఖ్య తగ్గి పోతుండడాన్ని గమనించిన ఇద్దరు ఉపాధ్యాయులు సమీపంలో ఉన్న ఇంటికి రూ.5 వేలకు అద్దెకు తీసుకొని మిగిలిన 25 మంది విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల దుస్థితిని అనేక పర్యాయాలు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి విద్యార్థుల సంఖ్య తగ్గి పోకుండా తగు చర్యలు తీసుకుని, నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

బాల్య వివాహాలతో అనర్థాలు

సరుబుజ్జిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో జరుగుతున్న అనర్థాలను రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి గీత అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జానకిలక్ష్మి ఆధ్వర్యంలో 'బాల్యవివాహ రహిత భారతదేశం' కార్యక్రమం నిర్వహించారు. బాలికలతో కలిసి మానవహారం చేపట్టారు. ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బారువ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురికి సోంపేట ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి కె.శ్రీనివాసరావు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మంగళవారం జరిమానా విధించారు.

చెన్నుపాటి లక్ష్మయ్యకి నివాళి

కంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని మంగళవారం కంచిలిలో నిర్వహించారు. పురుషోత్తపురం పాఠశాలలో లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని యూటీఎఫ్ నాయకులు నల్లాన రవి, లక్ష్మణరావు, మోహన్, సురేష్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

కంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చొట్రాయిపురం మండల పరిషత్ పాఠశాలకు భీమవరం కెనరా బ్యాంకు డిప్యూటీ మేనేజర్ మడ్డు మాధవరావు ప్రింటర్‌ను మంగళవారం హెచ్‌ఎం మడ్డు తిరుపతిరావుకు అందజేశారు.

అధికంగా రసాయన ఎరువులు వాడొద్దు

పాతపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవసరాలకు మించి రసాయన ఎరువులు వాడొద్దని ఏవో కె.సింహాచలం అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా చంగుడి గ్రామంలో సాగవుతున్న మొక్కజొన్న పంటను మంగళవారం పరిశీలించారు. రబీ వాణిజ్య పంటలపై రైతులు దృష్టిసారించాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీపీలుగా నాగరాజు పాత్రో, రాజేశ్వరరావు

శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు కోర్టులకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీలు)గా ఇద్దరు న్యాయవాదులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి గొట్టాపు ప్రతిభాదేవి ఉత్తర్వులు విడుదల చేశారు. ఆ మేరకు.. ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఏజీపీగా న్యాయవాది నాగరాజు పాత్రో, సోంపేట ఆరో అదనపు జిల్లా కోర్టుకు ఏజీపీగా కె.రాజేశ్వరరావు నియమితులయ్యారు. కలెక్టర్ సిఫారసుల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్ల వరకు ఏజీపీలుగా కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రిటైర్డ్ ఎంపీడీవో మహాలక్ష్మికి ఊరట

శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలానికి చెందిన విశ్రాంత ఎంపీడీవో వై.మహాలక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వం ఊరట నిచ్చింది. ఆమెపై నమోదైన అవినీతి ఆరోపణల కేసులో తదుపరి చర్యలను విరమించుకుంటూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2002 నాటి ఏసీబీ కేసులో కింది కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటించడంతో.. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న అప్పీల్ తీర్పునకు లోబడి.. ఆమె పెన్షన్ ప్రయోజనాలను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నాణ్యమైన మందులు సరఫరా చేయాలి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మందులు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రిమ్స్ ప్రాంగణంలో మంగళవారం ఔషధ నియంత్రణ కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 కార్యాలయాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ప్రారంభించగా శ్రీకాకుళం నుంచి ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో ఎన్నో పనులు చేపడుతున్నారన్నారు. అలాగే రిమ్స్‌లో నూతన వైద్య ఉపకరణాలను ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. 45 స్ట్రెక్చర్లు, బ్లడ్ బ్యాంక్‌లో 900 యూనిట్ల నిల్వ సామర్థ్యం కలిగిన మైనస్ 40 డిగ్రీల ఫ్రీజర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు వాషింగ్ మిషన్, ఇంటర్నెట్ సదుపాయాన్ని కూడా అందు బాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్ట్ చైర్మన్ అరవల రవీంద్రబాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ప్రసన్నకుమార్, ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, ఔషధ నియంత్రణాధికారి ఎన్.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

దూడల పెంపకంలో మెలకువలు పాటించాలి

● పశు సంవర్ధక శాఖ డీడీ డా.సత్యప్రకాష్


లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న పశు సంవర్ధకశాఖాధికారులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): లేగదూడల సంరక్షణలో పాడి రైతులు మెలకువలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి విభాగం డీడీ డాక్టర్ సీహెచ్ సత్యప్రకాష్ అన్నారు. మంగళవారం మండపల్లి పంచాయతీలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేలైన లేగదూడలు మంచి పాడి పశువులుగా రూపాంతరం చెందడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుం దన్నారు. అందువల్ల వాటి సంరక్షణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం లేగదూడలకు నట్టల నివారణ మందులు, కాలేయ టానిక్స్ ఉచితంగా అందజేశారు. ఆరోగ్యంగా ఉన్న లేగ దూడలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రైతులు పి.చంద్రశేఖర్, బి.నూకరాజు, కె.గోపి, పరమేశు, వల్లభరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పీజీ విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు వర్సిటీలో మంగళవారం ప్రారంభమ య్యాయి. ఈనెల 17వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఆర్ట్స్ కోర్సులకు సంబంధించి 319 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 17 మంది గైర్హాజరయ్యారు. సైన్స్ కోర్సులకు 395 మంది విద్యార్థులకు గాను 8 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.స్వప్నవాహిని పరిశీలించారు. అలాగే డీపీఈడీ, బీపీఈడీ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు. 12వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు తొలిరోజు 380 మంది విద్యార్థులకు గాను 369 మంది హాజరైనట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.


పరీక్షలను పరిశీలిస్తున్న సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.స్వప్నవాహిని

ఎక్సైజ్ కేసుల్లో ఏడుగురు బైండోవర్

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించామని, ఎవరైనా వీటిని ప్రోత్సహించినా చట్ట ప్రకారం చర్యలు తీసు కుంటామని సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ఏడుగురికి కౌన్సెలింగ్ నిర్వహించి మంగళవారం తహసీల్దార్ ఎన్.వెంకటరావు ఎదుట బైండోవర్ చేశారు. ఈ బైండోవర్ ఏడా ది పాటు అమలులో ఉంటుందన్నారు. దీ నిని అతిక్రమిస్తే రూ.2 లక్షలు జరిమానా వి ధించడం జరుగుతుందని సీఐ తెలిపారు. మద్యం నాణ్యమైనదా నకిలీదా అనే విషయాన్ని ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా వినియోగదారులు తెలుసుకోవచ్చన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తెలియజేయాలన్నారు.

మెగా క్రిస్మస్ వేడుకలు

పాత శ్రీకాకుళం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాస్టర్స్, లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా క్రిస్మస్ వేడుకలు మంగళవారం బాప్టిస్టు చర్చిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని ఇస్తూ ఏసు జననం, మరణం, పునరుత్థాన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైసీపీ నాయకులు ఎందుకు మాట్లాడట్లేదు?

● ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార పార్టీ నాయకుల తప్పిదాలపై వైసీపీ నాయకులు ఎందుకు మాట్లాడట్లేదని వైసీపీ బహిష్కృత నేత, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విషయమై వైసీపీకి చెందిన నాయకులు, మాజీ మంత్రులు ధర్మాన సోదరులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. తన వ్యక్తిగత కారణాలను ఎత్తిచూపి పార్టీ నుంచి బయటకు పంపారని వాఖ్యానించారు. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్రమంత్రులపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.

కేజీబీవీ విద్యార్థినికి పరామర్శ


విద్యార్థిని ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లోలుగు కేజీబీవీలో చదువుతూ పాఠశాల భవనం నుంచి పడి తీవ్రంగా గాయపడిన లోలుగుకు చెందిన సీహెచ్ వందనను మంగళవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సొంతంగా రూ.50 వేల సాయాన్ని అందించారు. పాఠశాలలో విద్యార్థినులపై జాగ్రత్తలు తీసుకోవాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు. విద్యార్థినికి అండగా ఉంటానని ఆమె కుటుంబానికి హామీ ఇచ్చారు.

కోటి సంతకాల సేకరణ పూర్తి

రణస్థలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ పూర్తయిందని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. సంతకాల సేకరణ లిస్టులను బుధవారం జిల్లా కేంద్రంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడికి అందించనున్నామన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై అమ్మకాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఐ.శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని ఇలిసిపురం రైతు బజారు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మకాలకు ఎవరూ ఆటంకం కలిగించరని, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోపు వినతులకు పరిష్కారం చూపాలి: ఎస్పీ


జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, పక్కన ఏఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్దీత గడువులోగా విచారణ చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి మంగళవారం సబ్ డివిజన్, సర్కిల్, స్టేషన్‌స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీసుస్టేషన్‌లో పెడింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. మొబైల్ ఫోన్ చోరీ, పోగొట్టుకున్న సందర్భాల్లో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి త్వరితగతిన వారికి అప్పగించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ తది తరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.17 కోట్లు మంజూరు

● సీఎం చంద్రబాబుకు ఎన్ఈఆర్ కృతజ్ఞతలు


ఎన్ఈఆర్ ఇచ్చిన వినతిని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

రణస్థలం/ఎచ్చెర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్ల అభివృద్ధికి రూ.17 కోట్లు నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. నిధుల మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడును మంగళవారం అమరావతిలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 52.24 కిలోమీటర్లకు రూ.17 కోట్లు మంజూరయ్యాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీలుగా మార్చాలి

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో విలీనమైన ఎచ్చెర్ల మండలం కుశాలపురం, తోటపాలెంలను తిరిగి పంచాయతీలుగా మార్చాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళ వారం అమరావతిలో మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణను అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. పూర్తిగా గ్రామీణ వాతావరణం ఉన్న ఈ గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయడం వల్ల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ముఖ్యంగా ఈ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు అమలు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సరైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పైడి అన్నంనాయుడు ఉన్నారు.

ముగిసిన పాఠశాలల క్రీడా పోటీలు


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సురంగి రాజా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న నియోజకవర్గ స్థాయి అంతర్ పాఠశాలల బాలబాలికల క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, హై జంప్ తదితర పోటీలు బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంఎస్‌వో కృష్ణపొడియా, హెచ్‌ఎం జె.ప్రకాష్, సూర్యారావు, పీఈటీలు గణేష్, శ్రీనివాసరావు, కె.పద్మనాభం రెడ్డి, వజీర్, సుధాకర్, షాజహాన్, యాదవ్, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీల్లో ప్రతిభ

బూర్జ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీల్లో బూర్జ మండలం కొల్లివలస బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ తెలిపారు. వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ల విభాగంలో విజేతలుగా, ఖోఖో, 800, 400 మీటర్ల రన్నింగ్‌లో రెండో స్థానం, వంద మీటర్ల రన్నింగ్‌లో మూడో స్థానం పొందారన్నారు. వాలీబాల్ జూనియర్ విభాగంలో విజేతలుగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీసీవో యశోదలక్ష్మి, ప్రిన్సిపాల్ రామకృష్ణ ఉపాధ్యాయులు అభినందించారు.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

● మెట్టక్కివలసలో స్థానికుల ఆగ్రహం
● చర్యలు తీసుకుంటామన్న కమిషనర్ రవి

ఆమదాలవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో ఉన్న వార్డు సచివాలయాల సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమయ పాలన పాటించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్టక్కివలస సచివాలయ సిబ్బంది మంగళవారం ఉదయం 10.45 గంటలకు కూడా రాకపోవడంతో స్థానికులు టీడీపీ నేతలు నాగళ్ల మురళీధర్ యాదవ్, మునగవలస రవీంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. గృహ నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకునేందుకు సచివాలయానికి వెళితే సిబ్బంది లేరని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే టీడీపీ నేతలు సచివాలయానికి చేరుకోగా 11 గంటల సమయంలో ఒక ఉద్యోగి వచ్చి సచివాలయ తలుపులు తీశారు. పట్టణ పరిధిలోని 10, 11 వార్డులకు సేవలందించాల్సిన ఈ వార్డు సచివాలయంలో 8 మంది ఉద్యోగులు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే విధులకు ఒక్కొక్కరుగా వచ్చారు. దీనిపై నేతలు కమిషనర్ రవికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన సచివాల యానికి వచ్చి ఉద్యోగుల హాజరు పట్టి, రికార్డులను పరిశీలించారు. ఐదుగురు ఉద్యోగులు విధులకు హాజరుకాలేదని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దీంతో ప్రజలు శాంతించారు.


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ తమ్మినేని రవి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఏడాదిన్నర కిందట రైలు ప్రమాదంలో రెండో కుమారుడు..
- లబోదిబోమంటున్న కుటుంబ సభ్యులు


సాయికుమార్ (ఫైల్)

కంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జలంత్రకోట జాతీయ రహదారి కూడలి వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకర్ణపురానికి చెందిన సీర సాయికుమార్ (28) మృతి చెందాడు. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గోకర్ణపురానికి చెందిన సాయి కుమార్ తన ద్విచక్ర వాహనంపై సోంపేట వెళుతుండగా జలంత్రకోట సమీపంలో రోడ్డు పనులు చేసేందుకు ఉంచిన వస్తువులను బలంగా ఢీ కొన్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి హైవేపై పడ్డాడు. అదే సమయంలో పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వైపు వెళుతున్న లారీ వెనుక చక్రాల కింద అతడు పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని స్థానికుల సమాచారం మేరకు ఒడిశా సరిహద్దు ప్రాంతంలో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు సాయి కుమార్ తండ్రి శ్యామ్ వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాని పోషిస్తున్నాడు. తల్లి చంద్రమ్మ గృహిణి. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు సాయికుమార్. చిన్న కుమారుడు రామకృష్ణ సైతం ఏడాదిన్నర కిందట రైలు ప్రమాదంలో మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకులిద్దరూ అకాల మరణంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. సాయికుమార్ పదో తరగతి చదువుకుని ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. మూడు నెలల కిందటే దుబాయ్ నుంచి ఇంటికి వచ్చాడు. మరలా విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తన స్నేహితుడికి అవసరమైన సామగ్రి కొనుగోలుకు మంగళవారం సోంపేట వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సాయి కుమార్ మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

పోలీసుల సమక్షంలో ఎరువుల పంపిణీ


పోలీసు సమక్షంలో ఎరువుల చీటీలను రాస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట-1, పెద్దకోట-2 రైతు సేవా కేంద్రాల్లో పోలీసుల సమక్షంలో మంగళవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ రెండు కేంద్రాలకు 888 యూరియా బస్తాలు వచ్చాయని వ్యవసాయాధికారి కిరణ్‌వాణి తెలిపారు. ఎలాంటి తోపులాటలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసులను ఏర్పాటు చేసి ఎరువుల చీటీలను రాసి రైతులకు పంపిణీ చేసినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కె.మన్మథరావు పాల్గొన్నారు.

అంతర పంటగా పెసర వేసుకోవాలి

కోటబొమ్మాళి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నలో అంతర పంటగా పెసర వేసుకుంటే అధిక లాభంతో పాటు పురుగు ఉధృతి తగ్గించవచ్చునని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.జగన్మోహన్‌రావు అన్నారు. మంగళవారం కన్నేవలస గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు పోటు నివారణకు వేపనూనే పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సంత అభివృద్ధి పనులను ప్రారంభించాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అతిపెద్దసంత అయిన నారాయణవలస పశువుల సంత అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ ఎన్.కృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, పీఆర్ డీఈ సుధాకర్‌తో కలిసి ఆయన మంగళవారం సంతమైదానం పరిశీలించారు. సంతకు వచ్చే వ్యాపారులు, గ్రామస్థుల సూచనల మేరకు సంతలో 16 షాపులు, రూ.2కోట్ల వ్యయంతో అంతర్గత సీసీరోడ్లు, పశువులకు నీడకోసం షెడ్లు, నీటి కుండీలు నిర్మించాలని, సంతకు వచ్చే వారికి నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఇందుకు సంబంధించిన ప్లాన్‌ను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జేఈ అజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దు

కాశీబుగ్గ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ జంటపట్టణంలో రోడ్లపై చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ సీఐ రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై దుకాణాలు పెట్టిన చిరువ్యాపారులతో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, దానివల్ల ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోతున్నాయని అన్నారు. ఫుట్‌పాత్ లోపలకు వెళ్లాలని వారికి సూచించారు. ప్రధాన జంక్షన్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పశువుల వృద్ధి రేటు పెరగాలి

పాతపట్నం డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పశువుల వృద్ధి రేటు పెరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మంచు కరుణాకరరావు ఆదేశించారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలు, మాంసం, గుడ్ల ద్వారా వృద్ధి రేటు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఏటా కనీసం 15 శాతం వృద్ధిరేటు సాధించాలని తెలిపారు. మినీ గోకులాల నిర్మాణం, పశుగ్రాసం పెంపకం, పశుదాణా పంపిణీ, వార్మింగ్ మందుల పంపిణీ, సిబ్బంది శిక్షణ వంటి చిన్నతరహా ప్రణాళికలు అమలు ద్వారా కనీస వృద్ధిరేటు సుసాధ్యం అవుతుందన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు పి.అనిల్, బి.శ్రీవాణి, కె.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని కొత్తూరు ఐసీడీఎస్ పీవో విమలకుమారి తెలిపారు. లక్ష్మీనర్సుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం నిర్వహించిన అద్భుత గర్భయాత్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల భావోద్వేగాలు శిశువు పెరుగుదలపైన ప్రభావం చూపిస్తాయని అన్నారు. అనంతరం గ్రామంలోని కేజీబీవీని సందర్శించి బేటీ బచావో-బేటీ బడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వసుధ పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ సంబరాలు


ఏసుప్రభు గీతాలను ఆలపిస్తున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పరిధిలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలను నిర్వహించారు. స్థానిక లివింగ్ స్టోన్ చర్చి ఆవరణలో నియోజకవర్గ పాస్టర్ ఫెలోషిప్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. బిషప్ రెవరెండ్ బీఎస్‌వీఎస్ కుమార్, కణితి అబ్రహం తదితరులు పాల్గొన్ని సందడిచేశారు.

హెచ్చరిక బోర్డు పెట్టినా వినట్లే!

- రోడ్డుపక్కనే పడేస్తున్న చెత్తా చెదారం
- చర్యలు చేపట్టడంలో అధికారుల తాత్సారం




మంచాలపేట రోడ్డులో పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు, రోడ్డుపక్కనే చెత్తా చెదారం వేసిన దృశ్యం

కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోని పెద్దచెరువును ఆనుకొని కోటబొమ్మాళి నుంచి మంచాలపేట మీదుగా ఉన్న రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోతుంది. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓసారి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ మార్గంలో వెళ్లినప్పుడు ఈ చెత్తను గమనించారు. ఈ ప్రాంతంలో చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డు పెట్టాలని ఆయన అధికారులను ఆదేశిం చారు. ఆయన చెప్పినట్లే పంచాయతీ కార్యదర్శి చింతాడ సన్యాసిరావు బోర్డును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎప్పటిలాగే ఆ మార్గంలో కొందరు వ్యక్తులు చెత్తాచెదారంతో పాటు చికెన్, మటన్ వర్థాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, అరటి గెలల చెత్తాను పారబోస్తున్నారు. అయినా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మంచా లపేట గ్రామస్థులతో పాటు కన్నేవలస, చీపుర్లపాడు గ్రామాలకు వెళ్లే వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ ఈవో సన్యాసిరావును వివరణ కోరగా.. చెత్త వేసే వారిని పట్టుకొని రూ.వెయ్యి వరకు జరిమానా విధిస్తామని తెలిపారు.

-కోటబొమ్మాళి

ఈ భవనాలను పట్టించుకోరూ!


వృథాగా ఉన్న ప్రభుత్వ భవనాలు

వీచ్చిమొక్కలు, ముళ్ల కంపల మధ్యలో పక్కనే ఉన్న ఈ రెండు ప్రభుత్వ భవనాలు పలాస మండలం టెక్కలి పట్నం గ్రామంలోనివి. ఇందులో ఒకటి పంచాయతీ భవనం కాగా, మరొకటి ఇతర శాఖలు నిర్వహించే భవనం. గతంలో ఈ భవనాల నుంచే పంచాయతీ పాలన నడిచేది. ప్రస్తుతం వేరే చోట గ్రామ సచివాలయం నిర్మించడంతో వీటిని విడిచిపెట్టారు. ప్రస్తుతం వాటిని వినియోగించకపోవడంతో వాటి ముందు దుకాణాలు వెలుస్తున్నాయి. వృథాగా పడి ఉన్న భవనాలకు మరమ్మ తులు చేపట్టి ఇతర ప్రభుత్వ పనులకు ఉపయోగించా లని గ్రామస్థులు కోరుతున్నారు.

-పలాసరూరల్

కూటమి వచ్చింది.. రోడ్డు పూర్తయింది


స్వామిపేట సీసీ రోడ్డు

ఇదీ నందిగాం పంచాయతీ స్వామిపేట గ్రామ సీసీ రోడ్డు. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే గ్రామస్థులు హడలిపోయేవారు. అరకిలోమీటరు వరకూ ఎక్కడికక్కడే గోతులతో దర్శనమిచ్చేది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ రోడ్డును పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఉపాధి హామీ పథకం కింద రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అలాగే మరో రూ.10లక్షలతో శ్మశాన వాటిక, తాగునీటి బోరుకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్లను నిర్మించారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. -నందిగాం

నిర్మించారు.. వదిలేశారు

- అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా హుద్‌హుద్ గృహ సముదాయం


నిరుపయోగంగా హుద్‌హుద్ గృహ సముదాయం

పలాస, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 198 చొప్పున నిర్మించిన హుద్‌హుద్ గృహాలను లబ్ధిదారులకు కేటాయించకుండా అధికారులు అలాగే వదిలేశారు. దీంతో ఆ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. ఎనిమిదేళ్ల కిందట అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హుద్‌హుద్ గృహాలను మంజూరు చేసింది. అప్పట్లో ఒక్కో గృహానికి రూ.4 లక్షల పైచిలుకు నిధులు వెచ్చించింది. పలాసలో నెమలి కొండదిగువున పారిశ్రామికవాడ రోడ్డులో ఈ గృహాలను నిర్మించారు. వీటిని లాంఛనంగా అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజి ప్రారంభించారు. ఇళ్ల కేటాయింపులు కూడా జరిగిపోయాయి. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో హుద్‌హుద్ గృహాలపై నీలినీడలు అలముకున్నాయి. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా లేదని, తామే లబ్ధిదారులను ఎంపిక చేసి గృహాలను ఇస్తామని చెబుతూ ఐదేళ్ల పాటు కాలయాపన చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత హుద్‌హుద్ గృహాలపై లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ ప్రభుత్వం వచ్చి 18 నెలలు పూర్తయినా లబ్ధిదారులకు ఇంకా గృహాలను కేటాయించలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పిచ్చిమొక్కలు భారీగా పెరిగిపోయాయి. రాత్రి అయితే చాలు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవ తీసుకొని హుద్‌హుద్ ఇళ్లను కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రేషన్ డిపోను ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం ఇస్తున్న కోదూరు గ్రామస్థులు

పాతపట్నంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోదూరు పంచాయతీ పరిధిలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు మంగళవారం ఆ పంచాయతీకి చెందిన ప్రహరాజపాలెం, కోదూరు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. తాము రేషన్ తీసుకునేందుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న బగంతర గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. సరైన రవాణా సౌకర్యం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, ఆ గ్రామంలో నెట్వర్క్ సిగ్నల్స్ సరిగ్గా ఉండక రేషన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకుముందు తమ పంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్న జీసీసీ డిపోలో రేషన్ ఇచ్చేవారని, మళ్లీ ఈ డిపోలోనే రేషన్ ఇచ్చే విధంగా సౌకర్యం కల్పించాలని, లేదా రేషన్ సబ్‌డిపోను కోదూరు పంచాయతీలో ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించి తహసీల్దార్ నందిగాం ప్రసాదరావు, సీఎస్‌డీటీ కుమారి సమక్షంలో ఆర్డీవోకు ఫోన్‌చేసి సమస్యను వివరించారు. అందుకు ఆర్డీవో సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జనవరి నుంచి కోదూరు, ప్రహరాజపాలెం గ్రామాల్లో రేషన్ పంపిణీకి ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు లింగుమహంతి శ్రీదేవి, జాడ తులసి, పకీర్, జమాల్, రోజా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాత పట్నం/హిర మండలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేసుకునే ఆర్థిక స్థోమతలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గొట్ట గ్రామానికి చెందిన పొట్నూరు రమణయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎంఆర్‌ఎఫ్‌ద్వారా రూ.45,047 మంజూరైంది. ఈ మొత్తాన్ని మంగళవారం పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు. మరో లబ్ధిదారు పుచ్చల హేమలతకు రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు దారపు డిల్లేశ్వరరావు, నాయకులు ఎస్.గోవింద, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

పాతపట్నం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఐదు మండలాల తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, వ్యవసాయశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలని, తేమశాతం పేరిట వివాదాలకు తావివ్వవద్దని అధికారులకు సూచించారు.ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు.

అవగాహన లేకనే కేంద్ర మంత్రిపై విమర్శలు


మాట్లాడుతున్న కళింగ వైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ గోవిందరాజులు తదితరులు

కోటబొమ్మాళి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవగాహన లేకనే వైసీపీ నాయకులు.. కేంద్ర విమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుపై విమర్శలు చేస్తున్నారని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇండిగో సంస్థ వివిధ కారణాలతో విమానాలు నడపకపోతే, దానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ ఎలా బాధ్యులవుతారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని రాజ్యసభలో మంత్రి స్పష్టంగా వివరించారని, అందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు పలువురు మంత్రులు అభినందించారని అన్నారు. ఈ విషయం వైసీపీ నాయకులు తెలుసుకోకుండా అవగాహన లేకుండా రామ్మోహన్‌పై బురదజల్లడం తగదన్నారు. ఆయన్ను విమర్శించే హక్కు వైసీపీ నేతలకు లేదన్నారు. ఈ సమావేశంలో కళింగ వైశ్య డైరెక్టర్ జామి వైకుంఠరావు, నీటి సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, పీఏసీఎస్ డైరెక్టర్లు సాసుమంతు ఆనందరావు, ఎస్.రాంకుమార్, పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి పనిచేయండి

నందిగాం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి ఎ.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం దిమిలాడలో మన ఊరు.. మన జెండా కార్యక్రమంలో భాగంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిష్ఠానం ఇచ్చిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి తద్వారా గ్రామాల్లో పార్టీని బలపరచాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.కామరాజు, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రతినిధి జె.పరమేశ్వరరావు, జిల్లా యువజన మోర్చా అధ్యక్షుడు బి.నరేంద్రచక్రవర్తి, నాయకులు సీహెచ్.లింగరాజు, కె.జగన్నాథం, కిషోర్‌కుమార్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


దిమిలాడలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రైవేటీకరణను నిరోధించేందుకే ప్రజాఉద్యమం

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరోధించేందుకే రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల పేరిట ప్రజాఉద్యమాన్ని చేపట్టినట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు అన్నారు. చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంగళవారం వైసీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అధ్యక్షతన జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల పిల్లలు వైద్యులుగా ఎదిగేందుకు తమ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేటుపరంచేసి విద్యార్థులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ నెల 15న జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా ఉద్యమం కోటిసంతకాల కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీలు కె.రవి, పి.విక్రాంత్, ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు పి.విష్ణు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

పీజీలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు

టెక్కలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కంప్యూటర్ సైన్స్‌లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో కంప్యూటర్ సైన్స్ పూర్తిచేసుకున్న వారు, ఇదివరకు ఏ కళాశాలలో ప్రవేశం పొందని వారు, పీజీ ప్రవేశ పరీక్ష రాయకపోయిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఐదు పంచాయతీల భవనాలకు నిధులు

కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదు పంచాయతీల్లో నూతన భవనాల నిర్మాణానికి రూ.1.75 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని పంచాయతీ రాజ్ జేఈ దుర్గాప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మెట్టూరు బిట్-1, గూనభద్ర ఆర్ఆర్ కాలనీ, కౌశల్యాపురం, అడ్డంగి, కలిగాం పంచాయతీలకు సంబంధించి ఒక్కొక్క భవనానికి రూ.35 లక్షల ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు చెప్పారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేస్తామని అన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలి

కొత్తూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 31న జరగనున్న సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని రైస్, ఆయిల్ మిల్లు శ్రామికుల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కొత్తూరులో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం చేస్తున్న సీఐటయూ పక్షాన ప్రతి ఒక్కరూ నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు ఈశ్వరావు, సీఐటీయూ జిల్లా కన్వీనర్ పనస రమేష్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

14న హిందూ సమ్మేళనం

పాతపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న ఖాళీస్థలంలో ఈనెల 14న హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని హిందువులంతా కుటుంబ సమేతంగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రీవెన్స్

పాతపట్నంరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం గ్రీవెన్స్‌ను నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పలువురు ప్రజలు ఆయన దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.